మాల కైటు గ్రీసు, ఖరీదైన రాళ్ళతోనూ అలంకరింపబడినది. హోమర్ రచనను బట్టి గ్రీకుపురాణంలో దేవతల మాత అయిన 'హీరా' స్నానమాడిన నీరు గ్రీకు దేవతల పానీయమట. హీరా తన శరీరాన్ని అమూల్యమైన తైలాలతో మర్దనా చేయించుకొనేదట. గ్రీకులకు వారి పురాణాలపై అమిత ఆసక్తి ఉండటం చేత దేవతల విషయంలో ఏం చెప్పబడి ఉన్న తప్పక ఆ ఆచారాలను పాటిస్తారు.

ఉత్తర జర్మనీలో ఎప్పుడూ ప్రవహించే నీటిలోనే స్నానం చేసే వారు. క్రీ.శ. 9వ శతాబ్దిలో చార్లెస్ సతీమణి "జూడేత్' చల్లని నీరు సౌందర్యాన్ని పెంచే కారకంగా ఆమె వర్ణించింది. చన్నీటి స్నానం వలన మనసు తేలిక అవుతుందని, ఉల్లాసంగా ఉంటుందని, ఆరోగ్య రీత్యా కూడా మంచిదని చెప్పడం జరిగింది.

14వ ఫ్రెంచి ప్రభువు లూయిస్ కాలంలో ఫ్రెంచి కోర్టులలో స్నానాన్ని చాలా నీచంగాను చిన్న చూపుతో చూసే వారు. ముఖాలను కడుక్కోవడానికి నీటిని బదులు వైన్‌లో ముంచిన దూదితో తుడుచుకొనే వారు. ఆ కాలంలో డచ్చి మహారాణి చాలా తక్కువ సమయాన్ని విలాస జీవితం కొరకు కేటాయించింది. ఆమె రాసిన సోపియా రాణి గాడిద పాలు మరియు నూనెల, మిశ్రమంతో 70సార్లు మునిగితే సౌందర్యం, ముఖ వర్చస్సులు అధికమవుతాయనే గ్రీకు తత్వవేత్త అయిన పైధాగరస్ ఇచ్చిన సలహాను జీవితాంతం పాటించింది.

ఇక ఇస్‌బెల్లా తన జీవితంలో రెండే రెండుసార్లు స్నానం చేసిందట. మొదటిసారి పుట్టినపుడు, రెండవసారి వివాహ సమయంలోను.

నెపోలియన్‌చే రాజుగా చేయబడి జోలికింగ్‌గా పేరొందిన వెస్ట్ పాలియా సతీమణి 'జిరోమ్' ఎప్పుడూ రెడ్ వైన్‌తో జలకాలాడేదిట.

ఈనాడు ఎన్నో క్రొత్త స్నానపు అలవాట్లను సృష్టించే అధునాతన హోటళ్ళు వెలిశాయి. పారిస్‌లో యాత్రీకులను ఆకట్టుకోవడానికి విస్కీ, షాంపేన్, కాఫీ ఒకటేమిటి ఏ పానీయం కావలిస్తే ఆ పానీయాన్ని అతి ఆకర్షణీయంగా అలంకరించిన స్నానపు తొట్టెలలోను, ఈత కొలనులలోను నింపి జల్సాగా క్రీడలాడడానికి సౌకర్యాలను కల్పిస్తున్నారు. హోటలు యజమానులు ఎందో డబ్బు ఖర్చు చేసి టూరిస్టులను ఆకర్షించుకొనుటకు ఎన్నో ప్రకటనలను అన్ని విదేశీ పత్రికలలోను ప్రచారానికై ప్రకటిస్తున్నారు. పారిస్‌లో సుమారు 1300 హోటల్లున్నాయంటే ఆశ్చర్యమే. స్నానం ఖరీదు 800 – రెండు వేల రూపాయల వరకు ఉంటుంది. ఎక్కువమంది ఈ రకపు స్నానాలకు ఎగబడడానికి కారణం ఈ స్నానాల ఆవరణంతా స్త్రీలే ఉండటం.

— ఎస్. రమేష్ చక్రవర్తి

## మినీ కథ



# రివర్స్

"తల్లీ మీరలా ఫుట్ బోర్డింగ్ చెయ్యకండి. తేడా వస్తే ప్రాణాని కొస్తది" అన్నాడు సిటీబస్ కండక్టర్ వేళ్లాడుతున్న అమ్మాయిల్ని చూస్తూ

"మంచిదే! రేపటి నుంచీ బస్ లెక్కే బాధ తప్పతుంది" అందో గడుగ్గాయ్ పిల్ల.

"నీకు తప్పతుందమ్మా! నాకు చావు మొదలవుతుంది" డ్రైవర్ మాటకు అందరూ నవ్వారు

బస్‌లో రష్ విపరీతంగా వుంది. కూర్చుందన్నమాటే గాని జనమంతా రాధ మీదే పడుతున్నారు. ఊపిరి ఆడనంత ఇబ్బందిగా వుంది రాధకు. కిటికీ పక్క సీటు వాళ్లు మాత్రం ఫ్రీగా ఉన్నారంతే.

రాధ పక్కనే ఒకావిడ నిలబడింది. ఆమె ఇప్పడిప్పడే ఆంటీగా ప్రమోట్ అయినట్టుంది. లావుగా వున్నా గానీ మొహం లేతగా వుంది. నిలబడలేక నానా అపసోపాలు పడుతుంది. ఆవిడ స్థితి గమనిస్తోంది రాధ. 'ఎప్పడో ఒకసారి బస్ లెక్కే వాళ్లే ఇలా ఇబ్బంది పడుతుంటారు. రోజూ అలవాటున్న వాళ్లలా అసహనపడరు' అనుకుంటూ ఆంటీ వైపు చూసింది.

ఆమె మొహం చూసినాక రాధకి కాస్త జరిగి సీట్ ఇద్దామా అనిపించింది. కాటన్ చుడీదార్ నలిగిపోతుందేమో! తల్లి మాటలు గుర్తొచ్చాయి రాధకి. "కాస్త బట్టలు నలగకుండా చూసుకుని రెండుసార్లు వేసుకో. ఇస్త్రీ వాడు నీ డ్రస్‌కి అయిదు రూపాయిలు తీసుకుంటున్నాడు. నాన్నగారికి తెలిస్తే 'డబ్బులిలా తగలేస్తున్నారా?' అని మొత్తుకుంటారు. నువ్వేమో అంత గంజి పెట్టుకుని అట్ట ముక్కల్లా కట్టుకోవాలంటావు. నా ఇస్త్రీ నీకు నచ్చదంటావ్" అంటూ చాలాసేపు సణిగిందమ్మ.

బస్ స్టాప్ స్టాప్ కీ రష్ పెంచుకుంటూ పోతోంది. ఆంటీ ఏడుపు మొహం పెట్టుకుంది నిలబడలేక. ఆమెను చూస్తోంటే భలే జాలేస్తోంది రాధకు. 'పాపం కదా! నా డ్రెస్ నలుగుతుందని తోటి ప్రాణి అంత అవస్థ పడుతుంటే చూస్తూ ఊరుకోవడం మానవత్వం కాదేమో' అనిపించింది.

ఏమయితే అయిందిలే అనుకుంటూ మధ్యలో ముందుకు జరిగి "కూర్చోండి" అంది రాధ. ఆంటీ 'అమ్మయ్య' అనుకున్నట్టుంది. ఠక్‌మనీ కూర్చుంది. థాంక్స్ కూడా చెప్పే ఓపిక లేనట్టుంది. గమ్మున కూర్చుంది. కనీసం రాధ వైపు చిరునవ్వుతోనన్నా చూడలేదు. కూలబడినట్టుగా అలాగే ఉండిపోయింది.

రాధ కాళ్లు పొడవుగా వుండడంతో ముందు సీటులోని వాళ్లకు ఆమె మోకాళ్లు తగిలాయి. వాళ్లిద్దరూ ఒక్కసారి కాస్త చిరాగ్గా వెనక్కు చూశారు. రాధ మొహం చిన్నబోయింది.

"పోనిద్దూ... చూస్తే చూశారు. నా సీట్ షేర్ చేసి ఒకామెకి కాస్త ఆనందం కలిగించాను కదా' అని తృప్తి పడుతూ సర్దుకుంది రాధ.

ఆంటీ లావుగా వుండడంతో ఆమెకి సీట్ సరిపోక కాస్త కాస్తగా రాధను నెడుతుంది. కిటికీ వైపున్నావిడ అదృష్టవంతురాలు. ఇవేమీ పట్టకుండా ఆనందంగా కిటికీపై చెయ్యి పెట్టి సుఖంగా నిద్రపోతోంది.

ఆంటీ మళ్లీ మళ్లీ బస్ ఆగినప్పడల్లా కాస్త కాస్త రాధను నెడుతోంది. మొత్తానికి రాధ కూర్చున్న చోటిప్పడు గుప్పెడుంది. కేవలం ముందు సీటుకి పెట్టిన కాళ్ల వల్ల ముందు సీట్ పైకి వాలడం వల్ల మాత్రమే కూర్చోగలుగుతుంది.

'అనవసరంగా అడక్కుండానే గొప్పకి పోయి సీట్ ఇచ్చి కష్టం తెచ్చుకున్నాను' అనుకుంది రాధ కాళ్లు నొప్పులు పుట్టి. 'డ్రెస్ నలగడం మాట దేవుడెరుగు. కాళ్లు రెండూ పట్టేసినాయ్' అనుకుంది దిగులుగా.

ఇంకా మూడు స్టాఫ్‌లు దాటితే గానీ రాధ కాలేజీ రాదు. 'ఆంటీ ఎక్కడైనా దిగిపోతే బావుండున"నుకుంటూ నడుము నొక్కుకుంది రాధ.

సడన్‌గా రాధ వీపు తట్టిందాంటీ. 'అమ్మయ్య దిగుతుందనుకుంటా. థాంక్స్ చెబుతున్నట్టుంది' అనుకుంటూ వెనుదిరిగింది రాధ చిరునవ్వు పులుముకుంటూ

"ఎక్కడ దిగుతావ్?" అందాంటీ విసుగ్గా రాధ వైపు చూస్తూ. ◆



—అల్లూరి గౌరీలక్ష్మి

28-3-97 ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిక